ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తమిళనాడు TAMILNADU

శనివారం 5 ఏప్రిల్ 2025





మరుదమలై మురుగన్ ఆలయ గోపురంపై సంప్రోక్షణ నిర్వహిస్తున్న వేదపండితులు. (ఇన్‌సెట్)లో స్వామివారు



కుంభాభిషేక వేడుకల్లో పాల్గొన్న భక్తులు

## మరుదమలై మురుగన్ ఆలయంలో

# ఘనంగా మహా కుంభాభిషేకం

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లాలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం మరుదమలై మురుగన్ ఆలయ మహాకుంభాభిషేకం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ మహాకుంభాభిషేక వేడుకలు మార్చి 30 ఉదయం తిరుమురై పారాయణం, విఘ్నేశ్వర పూజ తదితర కార్యక్రమాలతో ప్రారంభమయ్యాయి. తర్వాత ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం యాగశాల పూజలు చేశారు. ఆలయ ప్రహరీలోని దేవతామూర్తులు, పర్వతం దిగువనున్న తాన్‌తోండ్రి వినాయకుడు తదితర విగ్రహాలకు పచ్చకర్పూర చందన మిశ్రమంతో తాపడం చేశారు. అనంతరం కుంభ అలంకారం, గర్భాలయం నుండి పవిత్రనదీ జలాల కలశాలను ఊరేగింపుగా యాగశాల ప్రాంతానికి తీసుకువచ్చారు. ప్రధాన ఘట్టమైన మహా కుంభాభిషేక వేడుకలు శుక్రవారం ఉదయం 4.30 గంటలకు ప్రారంభమయ్యాయి. ఉదయం 6 నుంచి గర్భాలయం చుట్టూ ఉన్న దేవతా మూర్తుల సన్నిధులపైని గోపురకలశాలకు, విమానాలకు కుంభాభిషేకం జరిపారు. ఉదయం 8.30 గంటలకు మరుదాచలమూర్తి విమానం, ఆదిమూలవర్ల విమానం, రాజగోపురం, ధ్వజస్తంభం, పరివార విమానాలపై పవిత్రనదీ జలాలను చల్లారు. ఆ తర్వాత ఆలయం చుట్టూ ప్రధాన గర్భాలయ గోపుర కలశాలకు నిర్వహిస్తున్న సంప్రోక్షణ తిలకించిన భక్తులపై శైవపండితులు కుంభాభిషేక జలాలను చల్లారు. ఈ కుంభాభిషేక వేడుకల్లో పేరూరు ఆధీనం మరుదాచల అడిగళార్, సిరవై ఆధీనం కుమారగురుపర స్వామి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ జయకుమార్, సభ్యులు మహేష్‌కుమార్, ప్రేమ్‌కుమార్, కనకరాజన్, సుకన్యా రాజరత్తినం, ఆలయ డిప్యూటీ కమిషనర్ సెంథిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు మూలవర్లు సుబ్రహ్మణ్యస్వామికి మహా అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు సుబ్రహ్మణ్యస్వామి, వళ్ళి దైవానై సమేతుడై ఆలయ ప్రధాన వీధుల్లో ఊరేగారు. ఈ కుంభాభిషేక వేడుకలకు సుమారు 1500మంది పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.



రామేశ్వరం ఉత్తరకోశ మంగళనాథర్ ఆలయ కలశాలపై సంప్రోక్షణ చేస్తున్న శైవపండితులు

### ఉత్తరకోశమంగై మంగళనాథర్ ఆలయంలో...

రామనాథపురం జిల్లా ఉత్తరకోశమంగైలో సుప్రసిద్ధ మంగళ గౌరీ సమేత మంగనాథ స్వామివారి ఆలయ మహాకుంభాభిషేక వేడుకలు శుక్రవారం ఉదయం అత్యంత వైభవంగా జరిగాయి. ప్రపంచంలోనే మొదటి శివాలయంగా పేరుగడించిన ఈ ఆలయంలో ప్రతియేటా జనవరిలో జరిగే ఆరుద్రదర్శనం రోజున, ఆలయ కుంభాభిషేకం జరిగే సమయంలో నాలుగు రోజులపాటు మరకత నటరాజస్వామివారి దర్శనం కల్పిస్తున్నారు. ఆలయ కుంభాభిషేక వేడుకల్లో భాగంగా ఈ నెల ఒకటిన మరకత నటరాజస్వామిపై చందన తాపడాన్ని తొలగించి నిజరూపదర్శనం చేశారు. శుక్రవారం రాత్రి మళ్ళీ ఆలయ ప్రధానార్చకులు మరకత నగరాజ స్వామి విగ్రహానికి పూర్తిగా చందనతాపడం చేసి ఆ సన్నిధిని మూసివేశారు. శుక్రవారం ఉదయం జరిగిన ఆలయ కుంభాభిషేక వేడుకల్లో వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు శివాచార్యులు వేద మంత్రాలు పఠిస్తుండగా యాగశాల ప్రాంతం నుండి పవిత్ర నదీ జలాల కలశాలను ఆలయ రాజగోపం పైకి తీసుకెళ్ళారు. ఆ తర్వాత మంగళనాథర్, మంగళేశ్వరి ఆలయాలపైనున్న కలశాలపై పవిత్ర నదీజలాలను సంప్రోక్షించారు. ఈ వేడుకలను తిలకించేందుకు రామనాథపురం జిల్లా నలమూలల నుంచే కాకుండా మదురై, శివగంగ జిల్లాల ఉండి కూడా వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

## 'నీట్' వ్యవహారం...

# 9న మళ్లీ అఖిలపక్షం

- శాసనసభలో సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పంపిన నీట్ మినహాయింపు బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తోసిపుచ్చిన నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకునేందుకు ఈ నెల 9న అఖిలపక్ష సమావేశం జరుపనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. శాసనసభలో శుక్రవారం ఉదయం ఆయన మాట్లాడుతూ.. వైద్య కోర్సుల్లో అన్ని కులాలవారికి ప్రవేశం కల్పించేలా, మారుమూల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా లబ్ధిపొందేలా మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి రాష్ట్ర స్థాయిలో ప్రవేశపరీక్షలు జరిపి సామాజిక న్యాయం పాటించేలా అడ్మిషన్లు కల్పించారని తెలిపారు. అయితే కేంద్ర ప్రభుత్వం నీట్ అమలోకి తెచ్చిన తరువాత ప్లస్-2 ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులంతా వైద్య కోర్సుల్లో అడ్మిషన్లు పొందలేకపోతున్నారన్నారు. నీట్ అమలులోకి వచ్చిన తర్వాత దేశంలో ప్రైవేటు నీట్ శిక్షణా కేంద్రాల సంఖ్య విపరీతంగా పెరిగాయే తప్ప డాక్టర్ల సంఖ్య పెరగలేదని చెప్పారు. నీట్ సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా ఉండటంతో వైద్యకోర్సుల అడ్మిషన్లకు సంబంధించి ప్రత్యామ్నాయ పద్ధతిని అన్వేషించే దిశగా జస్టిస్ ఏకే రాజన్ కమిటీని తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఆ కమిటీ సిఫారసుల మేరకు 2021 సెప్టెంబర్ 13న శాసనసభలో నీట్ మినహాయింపు ముసాయిదా బిల్లును ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదింపజేసి గవర్నర్ ఆమోదం కోసం పంపితే ఆయన బిల్లును తిరస్కరించారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో 2022 మే 2న అఖిలపక్ష సమావేశం జరిపి, ఆ బిల్లును మళ్ళీ గవర్నర్ ఆమోదానికి పంపాలని నిర్ణయించి, ఆ ప్రకారమే బిల్లును రాజ్‌భవన్‌కు పంపామని, గవర్నర్ ఆ బిల్లుకు ఆమోదం తెలుపకుండా రాష్ట్రపతికి పంపి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. నీట్ మినహాయింపు ముసాయిదా బిల్లు రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నప్పుడు కేంద్ర ఆరోగ్యశాఖ, ఆయుష్‌శాఖ, హోంశాఖ, ఉన్నతవిద్యాశాఖ అంటూ పలు మంత్రిత్వ శాఖలు పలు అంశాలపై వ్యక్తం చేసిన అనుమానాలను నివృత్తి చేసేందుకు సమగ్రమైన వివరణలు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పంపినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలోని విద్యార్థి లోకానికి దిగ్భ్రాంతి కలిగించేలా నీట్ మినహాయింపు బిల్లును రాష్ట్రపతి తిరస్కరించినట్లు తమకు సమాచారం అందిందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన శాసనసభలో చేసిన ముసాయిదా బిల్లును కేంద్రం ఆమోదించకపోవడం గర్హనీయమన్నారు. ఈ నేపథ్యంలో నీట్ నుంచి మినహాయింపు పొందే దిశగా భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకునేందుకుగాను ఈ నెల 9వ తేదీ సాయంత్రం శాసనసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న అన్ని పార్టీల ప్రతినిధులతో సమావేశం జరుపనున్నామని తెలిపారు. ఆ సమావేశంలో నీట్ రద్దు కోసం చట్ట ప్రకారం చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో శాసనసభలోని సభాపక్షనాయకులందరూ పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



శాసనసభలో ప్రసంగిస్తున్న సీఎం ఎంకే స్టాలిన్

### నీట్‌పై స్టాలిన్ కపటనాటకం

#### ఈపీఎస్

నీట్‌ను రద్దు చేయిస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడిచినా ఆ పరీక్షలను రద్దు చేయించలేక, ముఖ్యమంత్రి అఖిలపక్ష సమావేశాలంటూ నాటకాలాడుతున్నారని అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధ్వజమెత్తారు. శాసనసభలో శాంతి భద్రతల సమస్యలపై మాట్లాడేందుకు స్పీకర్ అప్పావు అనుమతించకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ అన్నాడీఎంకే సభ్యులు సభ నుండి వాకౌట్ చేశారు. ఆ సందర్భంగా ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ ప్రముఖ పాత్రికేయుడు సవుక్కు శంకర్ నివాసంపై ఇటీవల జరిగిన దాడి విషయంపై సభలో మాట్లాడేందుకు ప్రయత్నిస్తే స్పీకర్ అడ్డుకున్నారని ఆరోపించారు. డీఎంకే అధికారంలోకి రాగానే నీట్ మినహాయింపునకు సంబంధించి తొలి సంతకం చేస్తానని స్టాలిన్ చెప్పారని, డీఎంకే నాయకులంతా ఎన్నికల ప్రచార సభల్లో నీట్‌ను రద్దు చేయించే మంత్రం తమకు మాత్రమే తెలుసునంటూ ప్రజలను మోసగించారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా నీట్ రద్దు చేయలేక పల్టీలు కొడుతున్నారని, ముఖ్యమంత్రి స్టాలిన్ మళ్ళీ అఖిలపక్ష సమావేశం పేరుతో కపట నాటకాలాడేందుకు సిద్ధమయ్యారని ఈపీఎస్ యెద్దేవా చేశారు.

## కొత్త వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా

# రాష్ట్రవ్యాప్తంగా టీవీకే ధర్నాలు

- రాజధాని నగరంలో 16 చోట్ల ఆందోళన

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదింపజేసిన కొత్త వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు జరిగాయి. ఈ ఆందోళనలో పార్టీ అధ్యక్షుడు విజయ్ మినహా పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ తదితర నాయకులు పాల్గొన్నారు. నగరంలో ఒకే సమయంలో 16 చోట్ల ధర్నాలు జరిగాయి. నగరంలో పోలీసులు అనుమతించిన ప్రాంతాల్లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ టీవీకే జిల్లా శాఖల నాయకులు ఆందోళనకు దిగారు.




### తాంబరంలో బుస్సీ ఆనంద్..

టీవీకే చెన్నై తూర్పు జిల్లా కార్యదర్శి అంబత్తూరు జి.బాలమురుగన్ నాయకత్వంలో అంబత్తూరు బస్‌స్టేషన్ వద్ద ధర్నా జరిగింది. ఈ ధర్నాలో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ పాల్గొని ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీల మనుగడకే ముప్పు కలిగించే రీతిలో వక్ఫ్ చట్టాన్ని తీసుకువచ్చిందని, ప్రధాన ప్రతిపక్షాలన్నీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకుండా పట్టుదలగా బిల్లును ఉభయ సభలలో ఆమోదింపజేసిందన్నారు. ఈ కొత్త వక్ఫ్ చట్టంతో బీజేపీ ప్రభుత్వానికి ఇకపై గడ్డురోజులేనని, రాబోవు ఎన్నికలలో ఆ పార్టీ తీవ్రంగా నష్టపోవటం ఖాయమన్నారు. ఇదే విధంగా చెన్నై (వెస్ట్) సౌత్ జిల్లా శాఖ కార్యదర్శి టి.నగర్ కే. అప్పు నాయకత్వంలో టి.నగర్ తపాలా కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. .చెన్నై (సౌత్) వెస్ట్ జిల్లా శాఖ కార్యదర్శి శబరినాదన్ నాయకత్వంలో కేకేనగర్‌లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ ధర్నాలో సుమారు 2 వేలమంది కార్యకర్తలు పాల్గొనటంతో ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెన్నై కలెక్టరేట్ ఎదుట చెన్నై (నార్త్) సౌత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాకు పార్టీ నాయకులు కట్‌పీస్ విజయ్, రాయపురం జగన్, ఎస్ నవీన్, రాయపురం వినోద్, ఏజీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### పల్లావరంలో...

చెంగల్పట్టు నార్త్ జిల్లా శాఖ అధ్వర్యంలో పల్లావరం అంబేడ్కర్ విగ్రహం కూడలి వద్ద జిల్లా శాఖ కార్యదర్శి మిన్నల్ కుమార్ నాయకత్వంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కారణంగా ఆ మార్గంలో గంటకు పైగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

### పట్టినంబాక్కంలో...

పట్టినంబాక్కం బస్‌డిపో ఎదురుగా జరిగిన ధర్నాకు పార్టీ జిల్లా శాఖ కార్యదర్శి కేవీ దాము నాయకత్వంలో ధర్నా జరిగింది. ఈ ఆందోళనలో వేళచ్చేరి, మైలాపూరు శాసనసభ నియోజకవర్గాలకు చెందిన జిల్లా శాఖ కార్యదర్శులు, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఆ సందర్భంగా అనుమతి లేకుండా ఆ ప్రాంతంలో ధర్నా జరిపారనే ఆరోపణలపై పోలీసులు ఆందోళనలో పాల్గొన్నవారినందరిని అరెస్టు చేశారు.

# చెన్నై కలెక్టరేట్‌లో ఘరానా మోసం

- కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేసి రూ.11.5 లక్షల స్వాహా
- ఇద్దరు ఆర్ఐల అరెస్టు

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):చెన్నై కలెక్టరేట్ కార్యాలయ భవనంలో పనిచేస్తున్న ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కలెక్టర్‌కు చెందిన ఎన్ఆర్ఐ బ్యాంక్ ఖాతా నుండి రూ.11.5 లక్షలు డ్రాచేసి ఘరానా మోసానికి పాల్పడ్డారు. పోలీసుల దర్యాప్తులో ఈ విషయం వెల్లడి కావటం తో వారిద్దరిని, వారికి సహకరించిన ఓ డ్రైవర్‌ను అరెస్టు చేశారు. విదేశాల్లో నివసిస్తున్న రాష్ట్రానికి చెందినవారెవరైనా మృతి చెందితే వా రి కుటుంబీకులకు ఆర్థిక సాయం పంపడానికి కలెక్టర్ పేరుతో ఓ ఎన్ఆర్ఐ బ్యాంక్ ఖాతా నిర్వహిస్తున్నారు. కలెక్టరేట్ ఆరో అంతస్థులో ఉన్న రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐలుగా పనిచేస్తున్న సుబ్రమణి, ప్రమోద్ ఇటీవల కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేసి చెక్కులు సమర్పించి ఎన్ఆర్ఐ ఖాతాలో రూ.11.5 లక్షలు డ్రా చేసి దినేష్ అనే డ్రైవర్ ఖాతాలో జమచేయించారు. ఇటీవల ఆర్థిక సంవత్సరం ముగిసిన సందర్భంగా బ్యాంక్ లావాదేవీలను కలెక్టర్ కార్యాలయ అధికారులు పరిశీలించగా, కలెక్టర్ ఎన్ఆర్ఐ ఖాతా నుండి రూ.11.5 లక్షల నగదు డ్రా అయినట్లు కనుగొన్నారు. వెంటనే సబ్ కలెక్టర్ హర్షద్‌బేగం ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేయగా కలెక్టరేట్ రెవెన్యూ శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఆర్ఐలు ఈ మోసానికి పాల్పడినట్లు కనుగొన్నారు. వారిని, ఈ మోసానికి సహకరించిన డ్రైవర్ దినేష్‌ను శుక్రవారం ఉదయం అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

# ప్రధానితో ఈపీఎస్, ఓపీఎస్ భేటీ

- మోదీతో వేర్వేరుగా సమావేశం

ప్యారీస్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఒక్కరోజు పర్యటన కోసం ఆదివారం రాష్ట్రానికి వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీతో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, ఆ పార్టీ బహిష్కృత నేత ఒ.పన్నీర్ సెల్వం వేర్వేరుగా భేటీ కానున్నారు. ఈ మేరకు వారిద్దరికీ ప్రధాని అపాయింట్‌మెంట్ ఖరారైనట్లు అన్నాడీఎంకే వర్గాలు తెలిపాయి. రామనాథపురం జిల్లాలో పాంబన్ వంతెన ప్రారంభోత్సవం కోసం ఈ నెల 6వ తేదీ ప్రధాని రానున్న విషయం తెలిసిందే. అక్కడి నుంచి ప్రధాని మదురైకి ప్రత్యేక హెలికాప్టర్‌లో చేరుకుని, .. ఢిల్లీ వెళ్తారు. ఈ నేపథ్యంలో మదురై విమానాశ్రయంలో ప్రధానితో ఈపీఎస్, ఓపీఎస్ వేర్వేరుగా భేటీ కానున్నట్లు సమాచారం. ఇటీవలే బీజేపీ అగ్రనేత అమిత్‌షాతో ఎడప్పాడి భేటీ అయిన విషయం తెలిసిందే. ఇప్పుడు మోదీతో కూడా సమావేశమై న తరువాత అన్నాడీఎంకే-బీజేపీల మధ్య పొత్తు ఖరారు కావడం తథ్యమని రాజకీయవర్గాలు చెబుతున్నాయి.

# అసెంబ్లీ నుంచి అన్నాడీఎంకే ఎమ్మెల్యేల వాకౌట్

ప్యారీస్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీలో శుక్రవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలో శాంతిభద్రతలపై మాట్లాడేందుకు స్పీకర్ అనుమతి నిరాకరించడాన్ని ఖండిస్తూ ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు సభనుండి వాకౌట్ చేశారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో పలువురి సభ్యుల ప్రశ్నలకు ముఖ్యమంత్రి స్టాలిన్ సమాధానం చెప్పారు. అనంతరం యూట్యూబర్ సౌక్కు శంకర్ నివాసంపై ఇటీవల జరిగిన దాడి అంశంపై సభలో మాట్లాడేందుకు ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిస్వామి అనుమతి కోరగా, స్పీకర్ నిరాకరించారు. దీంతో అన్నాడీఎంకే సభ్యులందరూ లేచి ఈపీఎస్ మాట్లాడేందుకు అనుమతించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అయినప్పటికీ స్పీకర్ అనుమతించకపోవడంతో ఈపీఎస్ సహా ఆ పార్టీ ఎమ్మెల్యేలందరూ 'ప్రజాస్వామ్యం కుప్పకూలింది, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని' నినాదాలు చేస్తూ సభనుండి వాకౌట్ చేశారు.



అసెంబ్లీ బయట మీడియాతో మాట్లాడుతున్న ఎడప్పాడి

## సమాచార దర్శిని

### 7 నుంచి ఎస్ఐ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అడయార్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 1299 ఎస్ఐ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 7వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఇదే విషయంపై తమిళనాడు యూనిఫార్మ్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలోని తాలూకా, సాయుధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఎస్ఐ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టింది. మొత్తం 1299 ఎస్ఐ పోస్టుల భర్తీ కోసం ఈ నెల 7వ తేదీ నుంచి ఔత్సాహిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దరఖాస్తు చేసేందుకు మే 3 చివరి తేదీగా నిర్ణయించారు.. తాలూకా స్థాయిలో 654 (పురుషులు), 279 (మహిళలు)తో కలిపి మొత్తం 933 పోస్టులను, సాయుధ విభాగంలో 366 పోస్టుల భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

### నేడు ఊటీకి స్టాలిన్

అడయార్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం ఊటీకి వెళ్ళనున్నారు. ఈ పర్యటనలో ఆయన కొత్తగా నిర్మించిన ప్రభుత్వ వైద్య కాలేజీ ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తారు. అలాగే, పది వేల మంది లబ్ధిదారులకు వివిధ సంక్షేమ సహాయాలను అందజేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా సీఎం స్టాలిన్ శనివారం ఉదయం 9.30 గంటలకు విమానంలో బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు కోయంబత్తూరు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో మేట్టుపాళెయంకు చేరుకుని విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 5 గంటలకు అక్కడ నుంచి ఊటీ చేరుకుంటారు. రాత్రికి ఊటీ ప్రభుత్వ అతిథి గృహంలో బస చేస్తారు. అలాగే, ఒక నక్షత్ర హోటల్‌లో జరిగే డీఎంకే ప్రముఖుడి ఇంటి శుభకార్యక్రమానికి ఆయన హాజరవుతారు. రెండో రోజైన ఆదివారం ఉదయం ఊటీలో రూ.164 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ వైద్య కాలేజీ, ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తారు.

### రేపు ఎస్కేపీడీలో శ్రీరామనవమి ఉత్సవాలు

ప్యారీస్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ)లో ఈ నెల 6వ తేదీ నుండి 17వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10గంటలకు ప్రత్యేక పూజల అనంతరం నవమి ఉత్సవాలను ఆలయ ప్రధాన అర్చకులు భాస్కర పంతులు ప్రారంభిస్తారు. 10వ తేదీ సాయంత్రం 6గంటలకు సీతారాముల కల్యాణోత్సవం, 17వ తేదీ ఆంజనేయ ఉత్సవం జరునుంది. ఎనిమిది రోజుల ఉత్సవాల్లో ప్రతిరోజు సాయంత్రం 6గంటల నుండి రాత్రి 8గంటల వరకు భజన, భక్తి సంగీత కచేరీలు నిర్వహించనున్నట్లు ఎస్కేపీడీ ట్రస్టీలు ఓ ప్రకటనలో తెలిపారు.

**అక్షయబాబా మందిరంలో...**

బ్రాడ్‌వే ఆచారప్పన్ వీధిలోవున్న అక్షయబాబా మందిరంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు జరగనున్నాయి. ఉదయం 10గంటలకు విఘ్నేశ్వర పూజ, సీతారాముల కల్యాణానికి సమర్పించే సారె వస్తువుల ఊరేగింపు, కల్యాణ వేదోపచార పూజ, మాంగళ్య సమర్పణ తదితర పూజల్లో భక్తులందరూ పాల్గొనాలని జై వాసవీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అజంతా కనిగెలుపుల శంకర్‌రావు పిలుపునిచ్చారు.

**వ్యాసర్పాడిలో...**

వ్యాసర్పాడి ఎంకేబీనగర్ 14వ వెస్ట్ క్రాస్ వీధిలో వున్న వలంపురి వ్యాస వినాయక దేవస్థానంలో ఆదివారం గణపతి పూజతో శ్రీరామనవమి వేడుకలు ప్రారంభంకానున్నాయి. మధ్యాహ్నం 12గంటలకు కోదండ రామస్వామి కల్యాణోత్సవం జరుగనుందని శ్రీరామ భక్తబృందం ఆర్గనైజర్ మొలగనూర్ విజయ్ కుమార్ పిలుపునిచ్చారు.

**కాకలూరు రామాలయంలో...**

తిరువళ్లూరు సమీపంలోని కాకలూరు మారుతీ న్యూటౌన్‌లోవున్న సెల్వ గణపతి ఆలయం, శ్రీరామ సన్నిధిలో ఆదివారం సీతారాముల తిరుకల్యాణోత్సవం జరగనుంది. ఉదయం 8గంటల నుండి రాత్రి 8గంటల వరకు అభిషేకాలు, విశేష అలంకరణ, తిరుకల్యాణం, హోమం, సీతారాముల ఉత్సవమూర్తుల ఊరేగింపు, భజన, అన్నప్రసాదాల వినియోగం వుంటుందని ఆలయ స్థాపకులు శ్రీమన్నారాయణ, కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు.

## ఒకే రోజు ఆరుగురు రౌడీల అరెస్టు

అడయార్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేసి ఆరుగురు రౌడీలను అరెస్టు చేశారు. స్థానిక పెరవళ్ళూరుకు చెందిన అమ్ము అనే వ్యక్తి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన సతీష్ కుమార్ అనే రౌడీ... గురువారం రాత్రి 9 గంటల సమయంలో అమ్ము ఇంటికి వెళ్ళి మద్యం బాటిల్‌తో దాడి చేసేందుకు యత్నించాడు. దీనిపై తిరువిక నగర్ పోలీసులకు అమ్ము ఫిర్యాదు చేయడంతో సీఐ కృపానిధి సారథ్యంలో పోలీసులు వచ్చి సతీష్ కుమార్‌ను అరెస్టు చేశారు. అదేవిధంగా ఓట్టేరి తిరువిక వీధికి చెందిన రామస్వామి, ప్రవీణ్ కుమార్, ఈయన స్నేహితుడు రంజిత్, వ్యాసార్‌పాడికి చెందిన కుల్లకన్నన్, వ్యాసార్‌పాడి సి. కళ్యాణపురంకు చెందిన ప్రవీణ్ కుమార్ సహా మొత్తం ఆరుగురు రౌడీలను అరెస్టు చేశారు. వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఈ రౌడీల్లో పలువురిపై పలు కేసులున్నట్టు విచారణలో వెల్లడైంది.

## పార్కింగ్ తగాదాలో బిగ్‌బాస్ ఫేమ్ దర్శన్ అరెస్టు


నటుడు దర్శన్

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కారు పార్కింగ్‌కు సంబంధించి జరిగిన గొడవలో హైకోర్టు న్యాయమూర్తి కుమారుడు, ఆయన భార్య, అత్తపై దాడి చేశారనే ఆరోపణపై బిగ్‌బాస్ ఫేమ్, నటుడు దర్శన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ముగప్పేర్‌లో దర్శన్ ఇంటిముందు గురువారం సాయంత్రం కారు పార్కింగ్ చేసేందుకు ప్రయత్నించిన న్యాయమూర్తి కుమారుడు, అయనభార్యపై దర్శన్, అతడి సహచరుడు లోకేష్ కలిసి దాడి చేసినట్లు జేజే నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. గాయపడిన న్యాయమూర్తి కుమారుడు, అయన భార్య ఆసుపత్రిలో చికిత్స తర్వాత డిశ్చార్జ్ అయ్యారు. ఈ నేపథ్యంలో దర్శన్‌ను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. తనతో గొడవకు దిగిన న్యాయమూర్తి కుమారుడిపై దర్శన్ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# శివకాశి అగ్గిపెట్టెల పరిశ్రమకు భౌగోళిక గుర్తింపు ?

● మంత్రి టీఎం అన్బరసన్



ప్యారీస్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శివకాశి నియోజకవర్గంలో తయారయ్యే అగ్గిపెట్టెలకు భౌగోళిక గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్నట్లు చిన్న, మధ్య తరగతి పరిశ్రమల శాఖామంత్రి టీఎం అన్బరసన్ పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో శుక్రవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలో శివకాశి, సాత్తూరు, కోవిల్‌పట్టి ప్రాంతాల్లో తయారయ్యే అగ్గిపెట్టెలకు భౌగోళిక గుర్తింపు పొందడానికి ప్రభుత్వం పరిశీలిస్తోందా అని శివకాశి ఎమ్మెల్యే అశోకన్ ప్రశ్నించారు. దీనికి చిన్నమధ్యతరగతి పరిశ్రమల శాఖామంత్రి మంత్రి టీఎం అన్బరసన్ సమాధానమిస్తూ, భౌగోళిక గుర్తింపు అనేది వ్యవసాయ ఉత్పత్తులు, బియ్యం, పప్పు దినుసులు, చేతివృత్తులకు సంబంధించిన అంశమని, దేశంలో 64 వస్తువులకు మాత్రమే భౌగోళిక గుర్తింపు వుందని ఇందులో తమిళనాడు ద్వితీయ స్థానంలో వుందన్నారు. తంజావూర్ జిల్లా కుంభకోణం తమలపాకు, కన్నియాకుమారి జిల్లా తోవాలై మణిపూసల మాల, కడలూరు జిల్లా పంద్రూటి పనస పండు, జీడిపప్పు, పులియంగుడి నిమ్మపండు, విరుదునగర్ సంబా వరి, రామనాథపురం చిత్తిరై బియ్యం, పెరంబలూరు చిన్న ఉల్లికి రెండ్రోల క్రితమే భౌగోళిక గుర్తింపు వచ్చిందన్నారు. అగ్గిపెట్టెల పరిశ్రమలను పరిశీలించినట్లైతే శివకాశి, సాత్తూరు ప్రాంతాల్లో 566 కంపెనీలు కోవిల్‌పట్టిలో సుమారు 400 కంపెనీలు అగ్గిపెట్టెలను ఉత్పత్తి చేస్తున్నాయని, ఈ సంస్థల ద్వారా ఏడాది సుమారు రూ.5వేల కోట్ల మేర విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు. అగ్గిపెట్టెల పరిశ్రమల ద్వారా విరుదునగర్ తూత్తుకుడి తదితర జిల్లాల 28,300 మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు వచ్చాయని, ఈ ప్రాంతాల్లో ఉత్పత్తి అవుతున్న అగ్గిపెట్టెలు దేశంలోని పలు రాష్ట్రాలు, విదేశాలకు కూడా ఎగుమతవుతున్నాయిని, అందువల్లే అగ్గిపెట్టెల పరిశ్రమల సంఘ నిర్వాహకులు భౌగోళిక గుర్తింపు పొందేందుకు ఆసక్తి చూపడంలేదని మంత్రి తెలిపారు. దీనికి అన్నాడీఎంకే ఎమ్మెల్యే కడంబూర్ రాజు మాట్లాడుతూ, ప్రపంచ దేశాల్లో మంచి గుర్తింపు వున్న శివకాశి అగ్గిపెట్టెలకు భౌగోళిక గుర్తింపు పొందేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి అన్బరసన్ ఈ అంశంపై పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని సమాధానం చెప్పారు.

## డ్రైవ్ చేస్తూ ఫోన్ మాట్లాడితే కఠిన చర్యలు

● వేలూరు జిల్లా ఎస్పీ మదివానన్



వేలూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు రోడ్లపై వాహనాల్లో ప్రయాణించే వారిలో కొంతమంది మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ, పలు ప్రమాదాలకు కారకులవుతున్నారు. దీనిని దృష్టిలో వుంచుకుని వేలూరు జిల్లా ఎస్పీ మదివానన్ మీడియాతో మాట్లాడుతూ, రోడ్లపై వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడేవారు ఎక్కువయ్యారని, ఇకపై వాహనాలు నడుపుతూ ఫోన్ మాట్లాడితే వారిపై కఠిన చర్యలు తప్పవని, పెద్ద మొత్తంలో అపరాధ రుసుములు చెల్లించాల్సివస్తుందని హెచ్చరించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, రోడ్డు భద్రతా సూచనలు పాటించాలని ప్రజలకు ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

### కుల గణనపై కేంద్రప్రభుత్వానికే అధికారం

● మంత్రి రఘుపతి

ప్యారీస్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కుల గణన నిర్వహణపై కేంద్రప్రభుత్వానికి మాత్రమే అధికారముందని రాష్ట్ర న్యాయశాఖా మంత్రి రఘుపతి పేర్కొన్నారు. అసెంబ్లీలో శుక్రవారం న్యాయశాఖ బిల్లుపై జరిగిన చర్చల్లో రాష్ట్రంలో కులాల వారీగా జనగణన నిర్వహించడానికి రాష్ట్రప్రభుత్వం ఎందుకు వెనకాడుతుందని అన్నాడీఎంకే ఎమ్మెల్యే ధళవాయి సుందరం ప్రశ్నించారు. ఇందుకు న్యాయశాఖ మంత్రి రఘు సమాధానమిస్తూ కులాల వారీగా జనగణన చేసే అధికారం కేంద్రప్రభుత్వానికి మాత్రమే వుందని, రాష్ట్రప్రభుత్వం కులగణన చేసినా చెల్లుబాటు కాదన్నారు. కుల గణన నిర్వహణకు డీఎంకే వ్యతిరేకం కాదని, పదేళ్ళు అధికారంలోవున్న అన్నాడీఎంకే ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలించలేదని మంత్రి తెలిపారు.

### హిందూ మున్నని నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గ సభ్యులతో కమిటీ నిర్వాహకులు

వేలూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలోని సేవూరు సెల్వపురంలో హిందూ మున్నని ఆధ్వర్యంలో మండల నూతన సభ్యుల నియామకం జరిగింది. శుక్రవారం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేలూరు కోట్టై అధ్యక్షుడు మహేష్ పాల్గొని కాషాయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం నూతన సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కోట్టై కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు పార్థిబన్ సహా గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### వక్ఫ్ బోర్డులో మార్పులపై టీవీకే నిరసన


నినాదాలు చేస్తున్న టీవీకే నేతలు

వేలూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు చట్టంలో మార్పులు తీసుకొస్తూ పార్లమెంటులో ప్రవేశపెట్టిన నూతన వక్ఫ్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వేలూరు కాట్పాడిలో శుక్రవారం ఉదయం తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్మిక సంఘాల నాయకులతో పాటు టీవీకే కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### తిరుచ్చి ఇంజనీర్ అరెస్టు

అడయార్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఉన్న ఒక యువతికి ఈమెయిల్, ట్విట్టర్, ఐ-మెసేజ్ ద్వారా అశ్లీల ఫొటోలను పంపిన తిరుచ్చికి చెందిన ఇంజనీర్ గిఫ్ట్ ఏసుబాలన్ సెల్వవినాయగంను చెన్నై నగర సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై నగర పోలీస్ కమిషనర్ అరుణ్‌కు నగరంలోని అమెరికా రాయబార కార్యాలయానికి చెందిన అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో తిరుచ్చికి చెందిన ఏసుబాలన్ సెల్వవినాయగంగా గుర్తించి అరెస్టు చేశారు.

## పెరియార్ వర్సిటీ వీసీ కేసు రద్దు చేయలేం

● మద్రాస్ హైకోర్టు

ప్యారీస్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం సేలంలోని పెరియార్ వర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆర్.జగన్నాథన్ సహా పలువురికి వ్యతిరేకంగా వర్శిటీ ఉద్యోగుల సంఘం తరుపున దాఖలు చేసిన కేసును రద్దుచేయలేమని మద్రాస్ హైకోర్టు తేల్చిచెప్పింది. ఈ వర్సిటీలో నిబంధనలు అతిక్రమించి, ప్రభుత్వ అనుమతి లేకుండా సంకేతిక ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల పరిశోధన ఫౌండేషన్ పేరుతో ప్రభుత్వ నిధుల నుండి ఓ విభాగాన్ని ప్రారంభించిన వైస్ ఛాన్సలర్ ఆర్. జగన్నాథన్ సహ పలువురికి వ్యతిరేకంగా వర్సిటీ ఉద్యోగుల తరుపున ఇళంగోవన్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సంస్థ గురించి ప్రశ్నించిన తనను కులం పేరుతో దూషించారని ఆయన తన ఫిర్యాదులో తెలిపారు. ఈ ఫిర్యాదు ఆధారంగా వీసీ ఆర్.జగన్నాథన్, రిజిస్ట్రార్ తంగవేల్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. తమకు వ్యతిరేకంగా పోలీసులు నమోదు చేసిన కేసును రద్దు చేయాలని కోరుతూ, ఆర్.జగన్నాథన్, తంగవేల్ తరుపున మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. అందులో కొత్త విభాగం ప్రారంభోత్సవానికి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేయలేదని, ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని విన్నవించారు. శుక్రవారం ఈ పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తి ఇళంద్రియన్ విచారణ జరుపగా, పోలీసుల తరుపు న్యాయవాది ఈ కేసును రద్దు చేయకూడదంటూ వాదించారు. ఈ వాదనను ఏకీభవించిన న్యాయమూర్తి జగన్నాథన్, తంగవేల్‌కు వ్యతిరేకంగా దాఖలైన కేసును రద్దు చేయలేమంటూ ఉత్తర్వులు జారీచేశారు.

## విద్యతోనే ఉన్నతస్థాయికి చేరుకోగలరు

● విద్యార్థులకు కలెక్టర్ సూచన


వాటర్‌ప్లాంటును పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి - విద్యార్థులతో కలెక్టర్

వేలూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పిల్లల చదువుకోసం ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని, బాగా చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోగలని విద్యార్థులకు కలెక్టర్ సుబ్బులక్ష్మి సూచించారు. వేలూరు జిల్లా గుడియత్తం మున్సిపాలిటీ పరిధిలోని వినాయగపురం ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో రూ.12.92 లక్షలతో చేపట్టిన వాటర్‌ప్లాంట్ పనులను శుక్రవారం ఉదయం కలెక్టర్ పరిశీలించారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో 10వ తరగతికి చేరుకున్న బాలికలతో ఆమె మాట్లాడుతూ అందరూ బాగా చదివి తల్లిదండ్రులకు గురువులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ యంగైకరసన్ సహా, తాహశీల్దారు జ్యోతి సహా పలువురు ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.

'రెండాకుల'పై 4వారాల్లో విచారణ ముగించేలా

## ఎన్నికల సంఘానికి ఉత్తర్వులివ్వండి

● హైకోర్టులో ఈపీఎస్ పిటిషన్

టి.నగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండటంతో అన్నాడీఎంకే చిహ్నం రెండాకుల వివాదంపై నాలుగు వారాల్లోగా విచారణ ముగించేలా కేంద్ర ఎన్నికల సంఘానికి ఉత్తర్వులివ్వాలని హైకోర్టును అభ్యర్థిస్తూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పిటిషన్ వేశారు. అన్నాడీఎంకే అంతర్గత విభేదాలకు సంబంధించి వివిధ న్యాయస్థానాల్లో దాఖలైన కేసులన్నీ పరిష్కారం అయ్యేంతవరకు పార్టీ చిహ్నమైన రెండుకుల గుర్తును స్తంభింపజేయాలని దిండుగల్‌కు చెందిన సూర్యమూర్తి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ కేసుపై విచారణ జరిపిన హైకోర్టు సూర్యమూర్తి పిటిషన్‌పై ఎన్నికల సంఘం విచారణ జరిపిన 4 వారాల్లో తగు నిర్ణయాన్ని ప్రకటించాలంటూ ఉత్తర్వు జారీ చేసింది. ఆ ఉత్తర్వును సవాలు చేస్తూ ఈపీఎస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాలకు సంబంధించి ఇతరులు దాఖలు చేసే పిటిషన్లపై ఎన్నికల సంఘం విచారణ జరుపకుండా స్టే ఉత్తర్వులివ్వాలని ఆ పిటిషన్‌లో ఈపీఎస్ కోరారు. ఈపీఎస్ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు ఎన్నికల సంఘం విచారణను నిలుపుదల చేస్తూ స్టే విధించింది. ఈ స్టే తొలగించాలని కోరుతూ మాజీ ఎంపీ రవీంద్రనాథ్, బెంగళూరుకు చెందిన పుగళేంది, కేసీ పళనిసామి సహా ఆరుగురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయమూర్తులు ఆర్. సుబ్రమణియన్, జి. అరుళ్‌మురుగన్‌తో కూడిన హైకోర్టు ధర్మాసనం గత ఫిబ్రవరిలో ఓ ఉత్తర్వు వెలువరించింది. ఆ మేరకు అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారం, రెండాకుల గుర్తుపై విచారణను నిలపుదల చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘంపై విధించిన స్టే ఉత్తర్వు తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఎన్నికల చిహ్నాల కేటాయింపు నియమ నిబంధనల ప్రకారం ఎన్నికల సంఘం విచారణ కొనసాగించవచ్చునని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈపీఎస్ హైకోర్టులో తాజాగా ఓ పిటిషన్ వేశారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎన్నికల ఏర్పాట్లపై తామంతా దృష్టిసారించాల్సి ఉందని, ఈ పరిస్థితులలో తమ పార్టీకి చెందిన వివాదాలపై విచారణ కేంద్ర ఎన్నికల సంఘం పెండింగ్‌లో ఉంచడం తగదని, అలా పెండింగ్‌లో ఉంచితే పార్టీ వ్యవహారాలపై అనవసరమైన పుకార్లు వ్యాపించే అవకాశాలున్నాయన్నారు. సుప్రీం కోర్టు గతంలో సాదిక్ అలీ కేసు విచారణ సందర్భంగా పార్టీ చిహ్నానికి సంబంధించిన విచారణను కేంద్ర ఎన్నికల సంఘం త్వరితగతిన విచారణ జరపాలని ఉత్తర్వులిచ్చిన సంగతి గుర్తుచేశారు. సుప్రీం కోర్టు ఉత్తర్వు ప్రకారం అన్నాడీఎంకే పార్టీ చిహ్నంపై విచారణను సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉంచడానికి వీలులేదని, అంతేకాకుండా హైకోర్టు విచారణ సందర్భంగా నాలుగు వారాల్లో విచారణ పూర్తి చేస్తామంటూ ఎన్నికల సంఘం ఇచ్చిన భరోసా గురించి కూడా ఈపీఎస్ తాజా పిటిషన్‌లో ప్రస్తావించారు. ఈ అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకుని అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాలు, పార్టీ చిహ్నం రెండాకుల వివాదాంపై కేంద్ర ఎన్నికల సంఘం 4 వారాల్లో విచారణ పూర్తిచేసి నిర్ణయం ప్రకటించేలా ఉత్తర్వులివ్వాలని ఈపీఎస్ ఆ పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ త్వరలో విచారణకు వస్తుందని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం అధికారులు తెలిపారు.

## ఎయిర్‌పోర్టులో నేరస్థుడి అరెస్టు

అడయార్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నై విమానాశ్రయంలో గత యేడాది కాలంగా అజ్ఞాతంలో ఉన్న తంజావూరుకు చెందిన పాత నేరస్థుడిని ఎయిర్‌పోర్టు పోలీసులు అరెస్టు చేశారు. ఈ నిందితుడుని మహ్మద్ అలీ ఉస్మాన్‌గా గుర్తించారు. దుబాయ్ నుంచి గురువారం రాత్రి 2.30 గంటల సమయంలో చెన్నై వచ్చిన విమానంలో ఈ నేరస్థుడు వచ్చాడు. అతడి పాస్‌పోర్టు, ఇమ్మిగ్రేషన్ పత్రాలను నిశితంగా పరిశీలించిన తర్వాత పోలీసులు పరారీలో ఉన్న నేరస్థుడుగా గుర్తించి అరెస్టు చేశారు.

## నేడు విద్యుత్ సమస్యలపై ప్రత్యేక శిబిరాలు

ప్యారీస్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శనివారం విద్యుత్ సమస్యలపై తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్‌ఈబీ) ప్రత్యేక శిబిరాలు నిర్వహించనుంది. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ శిబిరాల్లో టీఎన్‌ఈబీ చీఫ్ ఇంజనీర్లు, ప్రధాన అధికారులు పాల్గొని విద్యుత్ వినియోగదారుల సమస్యలకు పరిష్కారం చూపుతారు. రాజధాని నగరం చెన్నైలో 15 ప్రాంతాల్లో నిర్వహించే ప్రత్యేక శిబిరాల వివరాలు..

**మైలాపూర్ డివిజన్:** కోడంబాక్కం, నుంగంబాక్కం రోడ్డు జంక్షన్‌లోవున్న 110 కేవి. వళ్లువర్ కోట్టమ్ సబ్ స్టేషన్ ప్రాంగణం

**ఎగ్మూర్ డివిజన్:** వెప్పేరి ఈవీకే సంపత్ రోడ్డులో 33 కే.వి. ఎగ్మూర్ సబ్ స్టేషన్ ప్రాంగణం

**అన్నాసాలై డివిజన్:** చింతాద్రిపేట, లాబన్‌రోడ్డులోని టీఎన్‌ఈబీ కార్యాలయం.

**టీ,నగర్ డివిజన్:** కోడంబాక్కం, నుంగంబాక్కం రోడ్డు జంక్షన్‌లోవున్న 110 కె.వి. వళ్లువర్ కోట్టమ్ సబ్ స్టేషన్ ప్రాంగణం

**పెరంబూరు డివిజన్:** సెంబియం సింసన్ పారిశ్రామిక వాడ సమీపంలోని 110కె.వి. సబ్ స్టేషన్ ప్రాంగణం

**తండయార్‌పేట డివిజన్:** తండయార్‌పేట టీహెచ్ రోడ్డు గడియార స్తంభం సమీపంలోని టీఎన్‌ఈబీ కార్యాలయం

**వ్యాసర్పాడి డివిజన్:** వ్యాసర్పాడి ఎరుకంజేరి హైరోడ్డులో 33 కె.వి. సబ్ స్టేషన్ ప్రాంగణం

**పొన్నేరి డివిజన్:** పొన్నేరి వెన్‌పాక్కంలో 33 కె.వి. సబ్ స్టేషన్ ప్రాంగణం

**అంబత్తూరు డివిజన్:** ఆవడి ఎన్ఎంహెచ్ రోడ్డులో అంబత్తూరు 110కె.వి. సబ్‌స్టేషన్ ప్రాంగణం

**అన్నానగర్ డివిజన్:** అన్నానగర్ 11వ మెయిన్ వీధిలోవున్న 110 కె.వి. సబ్ స్టేషన్ ప్రాంగణం

**పోరూర్ డివిజన్:** పోరూర్ శ్రీరామచంద్ర మెడికల్ కళాశాల సమీపంలో 110 కె.వి. సబ్ స్టేషన్ ప్రాంగణం

**కేకేనగర్ డివిజన్:** వేళచ్చేరి మెయిన్ రోడ్డులో ఉన్న 110 కె.వి. సబ్ స్టేషన్ ప్రాంగణం.

**తాంబరం డివిజన్:** తాంబరం వెస్ట్ ముల్లైనగర్‌లో 110 కె.వి. సబ్ స్టేషన్ ప్రాంగణం.

**షోలింగనల్లూర్ డివిజన్:** పెరంబాక్కం గ్లోబల్ ఆసుపత్రి సమీపంలోని సేరన్ నగర్‌లో 110 కె.వి. సబ్ స్టేషన్ ప్రాంగణం.

**పల్లవరం డివిజన్:** పల్లవరం ఆఫీసర్స్ లైన్‌లో వున్న 110 కె.వి. సబ్ స్టేషన్ ప్రాంగణం.

**ఐటీ కారిడార్ డివిజన్:** గిండి రోడ్డులోని టైలింగ్ పార్క్ సమీపంలోవున్న ఐటీ కారిడార్ 110 కె.వి. సబ్ స్టేషన్ ప్రాంగణం.

## నీట్‌కు భయపడి విద్యార్థిని ఆత్మహత్య


సంధ్య (ఫైల్‌ఫొటో)

టినగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నీట్‌లో ఉత్తీర్ణత సాధించలేనని, ఎన్నోయేళ్లుగా డాక్టర్ కావాలన్న తన కోరిక నెరవేరదనే భయంతో ఓ విద్యార్థిని విషం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. సేలం జిల్లా ఎడప్పాడి సమీపం పుదుపాళయం పెరియముత్తయంపట్టి ప్రాంతానికి చెందిన సెల్వరాజ్, చంద్ర దంపతుల కుమార్తె సంధ్య గత యేడాది ప్లస్-2లో మంచి మార్కులతో ఉత్తీర్ణురాలైంది. డాక్టర్ కావాలన్న తపనతో జలకంఠాపురంలో ఉన్న ప్రైవేటు శిక్షణా కేంద్రంలో చేరి గత 10 నెలలుగా శిక్షణ పొందుతోంది. అయినా నీట్‌లో ఉత్తీర్ణత సాధించడం సులభం కాదనే భయం పట్టుకుంది. ఈ విషయాన్ని సంధ్య తన స్నేహితురాళ్లతో చెబుతూ బాధపడుతుండేది. ఈ నేపథ్యంలో ఈ నెల 31న ఇంటిలో ఎవరూ లేని సమయంలో విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చుట్టుపక్కల వారు ఏదో పనిమీద ఆ ఇంటికి వచ్చినప్పుడు నోటిలో నురగలు కక్కుకుని సంధ్య నేలపై పడి ఉండటం చూసి వెంటనే సేలంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గత రెండు రోజులుగా చికిత్స పొందుతున్న సంధ్య శుక్రవారం వేకుజాము మృతి చెందింది. కొంగణాపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## సోదరుడి మృతిని తట్టుకోలేక ప్రాణాలు విడిచిన సోదరి

టినగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా కిరుంగాకోట్టై సామియాడిగనం ప్రాంతంలో గుండెపోటుకు గురై తమ్ముడు ఆకస్మికంగా మృతి చెందటంతో అతడి సోదరి అంత్యక్రియల సమయంలో బోరునవిలపిస్తూ భౌతికకాయంపై పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటన కుటుంబీకులు, బంధువులు, స్థానికులను కంటతడిపెట్టించింది. సామియాడిగనంలో నివసిస్తున్న మరుదన్ (49) న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. ఆయన సోదరి పుష్పం (60) వేంగైపట్టిలో భర్త, పిల్లలతో ఉంటోంది. మరుదన్‌ను అతడి సోదరి పుష్పం కంటికి రెప్పలా అతడి బాగోగులను చూసుకునేంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి మరుదన్ గుండెపోటుతో మృతి చెందాడు. తమ్ముడి ఆకస్మిక మృతి గురించి తెలుసుకున్న పుష్పం దిగ్భ్రాంతి చెంది బోరున విలపించింది. గురువారం ఉదయం మరుదన్ అంత్యక్రియలకు సంబంధించి ఏర్పాట్లు జరుగుతుండగా పుష్పం విలపిస్తూ హఠాత్తుగా తమ్ముడి మృతదేహంపై పడి ప్రాణాలు కోల్పోయింది. కుటుంబీకులు పుష్పంను లేపేందుకు ప్రయత్నించినప్పుడు ఆమె మృతి చెందినట్లు కనుగొని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ తర్వాత శోకతప్తులైన కుటుంబీకులు, బంధువులు, స్థానికులు కన్నీటి పర్యంతమైన అక్కా, తమ్ముడి అంత్యక్రియలు నిర్వహించారు.

## ఫుట్‌బోర్డుపై విద్యార్థుల ప్రయాణం

● అదనపు బస్సులను నడపాలని ప్రజల డిమాండ్


బస్సు ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తున్న విద్యార్థులు

తిరుత్తణి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలోని పలు ప్రాంతాల నుండి ప్రతిరోజు వందలాది మంది విద్యార్థులు తమ కళాశాలలకు వెళ్లేందుకు ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. ఈ క్రమంలో ప్రతిరోజు తిరుత్తణి సమీపించేలోపే బస్సు పూర్తిగా నిండిపోతుండటంతో, విద్యార్థులు ఫుట్‌బోర్డుపై నిలుచుని తమ కళాశాలలకు చేరుకుంటున్నారు. ఇదిలా వుండగా, కొంతమంది ఆకతాయి విద్యార్థులు బస్సు ఫుట్‌బోర్డుపై నిల్చుని గట్టిగా శబ్దాలు చేస్తూ, ప్రయాణికులకు అసౌకర్యాన్ని కలిగిస్తూ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు పలుమార్లు అధికారులకు వినతిపత్రాలను సమర్పించినా ఫలితంలేదని వాపోతున్నారు. దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకుని కళాశాలలకు వెళ్లే విద్యార్థుల కోసం అదనపు బస్సులను నడపాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఎన్‌సీసీపీఏ ఆధ్వర్యంలో నిరసన



నిరసనలో కార్యక్రమంలో ఎన్‌సీసీపీఏ సభ్యులు

వేలూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ విధానంపై కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులపై నిరసిస్తూ నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పింఛనర్స్ అసోసియేషన్ (ఎన్‌సీసీపీఏ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఉదయం జరిగిన ఈ నిరసనలో ఎన్‌సీసీపీఏ జిల్లా అధ్యక్షుడు కదిర్ అహ్మద్ మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వ వక్ఫ్ విధానంపై తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించి, పాత వక్ఫ్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ మూర్తి సహా పలు శాఖ మాజీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## డీఎంకే ఆధ్వర్యంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే నందకుమార్, డీఎంకే నేతలు

వేలూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వేలూ రు అనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్ ఆధ్వర్యంలో వేలూరులోని డీఎంకే కార్యాలయం ఎదుట పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నందకుమార్ మాట్లాడుతూ, 2019లో కరోనా కాలంనుండి ఎన్నో వినూత్న సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నందకుమార్ సహా పలువురు డీఎంకే నేతలు పాల్గొన్నారు.

## అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా సెంగోట్టయ్యన్

● నగరంలో వెలిసిన పోస్టర్లు



అడయార్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అంటూ పలు ప్రాంతాల్లో పోస్టర్లు వెలుస్తున్నాయి. మదురై జిల్లా తిరుమంగళం బస్టాండ్, మరవన్‌కుళం, ఈబీ స్టాప్‌తో సహా పలు ప్రాంతాల్లో ఈ పోస్టర్లు కనిపించాయి. ఈ పోస్టర్లలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి కేఏ సెంగోట్టయ్యన్ అంటూ ముద్రించారు. ఈ పోస్టర్లు అన్నాడీఎంకే శ్రేణుల్లో కలకలం సృష్టించాయి. ప్రస్తుతం అన్నాడీఎంకేలో ఎడప్పాడి పళనిస్వామి, కేఏ సెంగోట్టయ్యన్‌ల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. ముఖ్యంగా ఎడప్పాడి పాల్గొనే కార్యక్రమాలకు ఆయన హాజరుకావడం లేదు. ఇది పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. ఈనేపథ్యంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి కేఏ సెంగోట్టయ్యన్ అంటూ పోస్టర్లు మదురై నగరానికి చెందిన సెంట్రల్ నియోజకవర్గ కార్యదర్శి మిసా జీఎస్ సెంథిల్ ముద్రించారు.

## ‘వీర ధీర శూరన్’కు మరిన్ని సీక్వెల్స్


అభిమానులతో చియాన్ విక్రమ్ సెల్ఫీ

● చియాన్ విక్రమ్


ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకత్వంలో తాను తాజాగా నటించిన ‘వీర ధీర శూరన్’ చిత్రానికి మరిన్ని సీక్వెల్స్ వస్తాయని హీరో చియాన్ విక్రమ్ వెల్లడించారు. గత నెల 27న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘వీర ధీర శూరన్’ మూవీకి పాజిటివ్ టాక్ రావడంతో పాటు విజయవంతంగా ప్రదర్శితమవుతుంది. దీంతో ఈ మూవీ సక్సెస్ టూర్‌లను చిత్ర బృందం నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా ఈరోడ్‌లో జరిగిన సక్సెస్ టూర్‌లో చియాన్ విక్రమ్ అభిమానులతో కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ‘ఈ మూవీకి ప్రేక్షకుల నుంచి అనూహ్య స్పందన రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఒక మంచి చిత్రాన్ని ఇచ్చిన దర్శకుడు అరుణ్ కుమార్‌కు ధన్యవాదాలు. అభిమానుల కోసం తీసిన సినిమా. ఈ మూవీ మొదటి భాగం, మూడో భాగం త్వరలోనే రూపొందుతాయి. మొదటి భాగంలో నా పాత్రకు సంబంధించిన నేపథ్యం ఉంటుంది’ అని చియాన్ విక్రమ్ వివరించారు. కాగా, ఈ చిత్రం గత వారాంతానికి రూ.52 కోట్లు వసూలు చేసినట్టు మేకర్స్ ఓ పోస్టర్ ద్వారా అధికారికంగా వెల్లడించారు.

## తరుణి

నేటి సమాజంలో ఎంతోమంది తల్లిదండ్రులు పిల్లలకు ఏది ఇష్టమో దానికి విలువ ఇవ్వకుండా తమ ఇష్టాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. కానీ పిల్లలు కోరుకున్న రంగంలో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే వారి భావి జీవితం ఉజ్జ్వలంగా ప్రకాశిస్తుంది. చిరుప్రాయంలోనే కుమార్తెకు నాట్యంపై గల అభిరుచిని గ్రహించిన ఆమె తల్లిదండ్రులు కుమార్తెకు భరత నాట్యం నేర్పించాలని నిర్ణయించారు. తన ఆసక్తిని పండించుకుంటున్న ఆమె ఓ వైపు చదువు మరోవైపు నాట్యంలో సమాంతరంగా కృషిచేస్తోంది ఆ వర్ధమాన భరతనాట్య కళాకారిణి ‘అప్సర’ నాట్య, చిత్రకళా ప్రస్థానం యీనాటి ‘తరుణి’లో....

- వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి





## అభినయంలో లావణ్యం... చిత్రకళలో ప్రావీణ్యం

● వర్ధమాన భరతనాట్య కళాకారిణి ‘అప్సర’

అప్సర పుట్టి పెరిగింది చెన్నైలోనే. తల్లి శాంతి. గృహిణిగా కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే విరామ సమయంలో ఆన్‌లైన్‌లో మ్యూజిక్ క్లాసులు తీసుకుంటూ సమయాన్ని సద్వినియోగం చేస్తుంటారు. తండ్రి బాబు. అప్సరకు ఒక సోదరుడు. అప్సర కీల్పాక్కం లోని కోల సరస్వతి పాఠశాలలో 12వ తరగతి వరకు చదివి యతిరాజు కళాశాలలో మైక్రోబయాలజీ ప్రధానాంశంగా బీఎస్సీ పట్టా పొందింది. ప్రస్తుతం అన్నా యూనివర్శిటీ నుండి ఫైన్ ఆర్ట్స్‌లో పి.జి. చేస్తున్నది.

### నాట్యప్రస్థానం..

బాల్యంలోనే నాట్యం వైపు అడుగులేసింది అప్సర. ఆమెకు నాట్యం పైన ఉన్న ఆసక్తికి గమనించారు ఆమె తల్లిదండ్రులు. శాస్త్రీయ నృత్యం నేర్పిస్తే ఆ రంగంలో ఆమె రాణించగలదని భావించారు. వెంటనే భరతనాట్యాచార్యుల వద్ద ఆమెకు భరతనాట్యం శిక్షణకు చేర్పించారు. ఏడేళ్ల వయసులోనే నాట్య గురు రాధికా కళ్యాణి వద్ద భరత నాట్యాభ్యాసానికి శ్రీకారం చుట్టింది అప్సర. 10 ఏళ్ల వయసులోనే చెన్నైలోని పలు దేవాలయాల్లో నాట్య ప్రదర్శనలిచ్చి ప్రశంసలు అందుకొన్నది. స్కూల్, కాలేజీలో కూడా సాంస్కృతిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ ఎన్నో నాట్య ప్రదర్శనలు ఇచ్చింది. కాలేజీలో ఫైన్ ఆర్ట్స్ క్లబ్‌కి వైస్ ప్రెసిడెంట్‌గా పలు కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించింది.



### నాట్య ప్రదర్శనలు...

చెన్నైలోని బ్రహ్మ గానసభ, పుష్పాంజలి ట్రస్ట్, కార్తీక్ ఫైన్ ఆర్ట్స్ తదితర సభలు ఆమె నాట్య ప్రదర్శనకు వేదికలయినాయి. నగరంలోని దేవాలయాల్లోనే కాకుండా వేలూరు గోల్డెన్ టెంపుల్, మదురై మీనాక్షి ఆలయం, కాంచీపురం ఏకాంబరేశ్వరాలయం తదితర దేవాలయాల్లో ఆమె నాట్య ప్రదర్శనలిచ్చింది. చిదంబరంలో నాట్యాంజలి ప్రోగ్రామ్‌లో తన నృత్యంతో ప్రేక్షకులనలరించింది అప్సర. తంజావూరు పెరియ కోవెల ఫెస్టివల్‌లో కూడా తన భరతనాట్య ప్రతిభను కనబరిచింది. ఇంకా నాట్యాభ్యాసాన్ని కొనసాగిస్తూనే తన గురువు నిర్వహిస్తున్న డాన్స్ స్కూలులో విద్యార్థులకు నాట్యంలో ప్రాథమికాంశాలు నేర్పుతూ బోధన నైపుణ్యాన్ని అందిపుచ్చుకుంటున్నది.

“నాట్యం కాలక్షేపానికి కాకుండా ఇక కళగా ఆరాధించి అభ్యసించాలి. ఏకాగ్రత ఉంటేనే ఏ కళ అయినా సొంతమవుతుంది. దానికి పరిశ్రమ తోడైతే విజయం తథ్యం”. అని తరుణితో తన మనోభావాలు పంచుకున్నారు అప్సర.

భరతనాట్యంలో మెళకువలు నేర్చుకుంటూ, ప్రదర్శనలివ్వడమే కాకుండా ఒక కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు అప్సర. ఆమెలో మరో కోణం ఉంది. అప్సర చిత్రకారిణి. ఆశ్చర్యమేమంటే ఆమె ఏ గురువు వద్దా చిత్రలేఖనం అభ్యసించలేదు. ఏకలవ్యుడి లాగా స్వయంగా నేర్చుకొని అందులో నైపుణ్యం పొందింది. కొవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న సమయంలో అందరూ ఇళ్లకే పరిమితమైన వేళ అప్సర స్వయంకృషితో ‘మండల పెయింటింగ్స్’ వేయడం నేర్చుకున్నది. అందులో ప్రావీణ్యం సంపాదించి తన పెయింటింగ్స్‌తో ఆన్‌లైన్‌లో బిజినెస్ ప్రారంభించింది. గత కొన్నేళ్లుగా యీ బిజినెస్ విజయం బాటలో పయనిస్తున్నది. పి.జి. పూర్తిచేశాక పీహెచ్‌డీ చేయాలన్నది తన ఆశయంగా పేర్కొన్నది అప్సర. భవిష్యతులో డాన్స్ స్కూలు పెట్టి తనలాగే ఎంతోమందిని భరతనాట్య కళాకారులుగా తీర్చిదిద్దాలన్న అభిలాషను ఆమె వ్యక్తం చేసింది.


నృత్య ప్రదర్శనలో తోటి కళాకారులతో...


తాను రూపొందించిన పెయింటింగ్స్‌తో...

## వయసు పెరుగుతుంటే ఉత్సాహం తగ్గిపోతుందా?

● రష్మిక మందన్న



వయసు పెరిగే కొద్దీ పుట్టిన రోజు జరుపుకోవాలని ఆశ, సంతోషం తగ్గిపోతుందని పలువురు వ్యాఖ్యానిస్తుంటారనీ, అలాంటి వారి మాటలతో తాను ఏకీభవించనని ప్రముఖ హీరోయిన్ రష్మిక మందన్న అంటున్నారు. ఆమె తన 29వ పుట్టిన రోజు వేడుకలను శనివారం జరుపుకోనున్నారు. దీన్ని పురస్కరించుకుని ఒక ట్వీట్ చేశారు. ‘ఇది నేను పుట్టిన నెల. అందుకే నేను ఎంతో ఉత్సాహంగా ఉన్నాను. వయసు పెరిగే కొద్దీ పుట్టిన రోజులు జరుపుకోవాలన్న ఆశ తగ్గిపోతుందని పలువురు కామెంట్స్ చేస్తుంటారు. కానీ, నాలో అలాంటి భావన కనిపించడం లేదు. మరింతగా రెట్టింపు సంతోషాన్ని ఎంజాయ్ చేస్తున్నాను. ఇపుడు నా వయసు 28 యేళ్ళుపూర్తయి 29వ యేటలోకి అడుగుపెడుతున్నాను. గత యేడాదికాలంలో ఎంతో ఆనందంగా, ఆరోగ్యకరంగా ఉన్నాను’ అని పేర్కొన్నారు.

తమిళ చిత్రజ్యోతి


స్టూడియోలో ధనుష్

## అరుణ్ విజయ్ చిత్రానికి ధనుష్ గాత్రదానం

‘మాన్ కరాటే’, ‘గెత్తు’ వంటి చిత్రాలను రూపొందించిన క్రిష్ తిరుకుమరన్ దర్శకత్వంలో హీరో అరుణ్ విజయ్ ఓ కొత్త చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రంలోని ఓ పాటకు ప్రముఖ హీరో ధనుష్ నేపథ్యగానం చేశారు. సీఎం శ్యామ్ సంగీత స్వరాలు సమకూర్చిన ఈ చిత్రానికి ‘రెట్ట తల’ అనే టైటిల్ ఖరారు చేశారు. ఇందులో సిద్ధి ఇద్నానీ, తాన్య రవిచంద్రన్ హీరోయిన్లుగా నటించారు. ఈ మూవీ కోసం ధనుష్ ఒక పాటకు నేపథ్యగానం చేశారు. సాధారణంగా తాను నటించే చిత్రాలకు మినహా ఇతర హీరోల చిత్రాలకు ధనుష్ పాటలు పాడటం చాలా అరుదు. గతంలో అలా పాడిన సందర్భాలు కూడా లేవు. అత్యంత సన్నిహితంగా మెలిగే ఒకరిద్దరు హీరోల చిత్రాలకు ధనుష్ గాత్రదానం చేశారు. ఇపుడు అరుణ్ విజయ్ చిత్రంలో ధనుష్ పాట పాడటానికి ఓ కారణం లేకపోలేదు. ధనుష్ స్వీయ దర్శకత్వంలో రూపొందిన ‘ఇడ్లీ కడై’ మూవీలో అరుణ్ విజయ్ ప్రతినాయకుడి పాత్ర పోషించడం గమనార్హం.

## ప్రముఖ నటుడు రవికుమార్ మృతి


రవికుమార్ (ఫైల్‌ఫొటో)

తమిళం, మలయాళం తదితర భాషల్లో వందకుపైగా చిత్రాల్లో నటించిన ప్రముఖ నటుడు, నటి సుమిత్ర భర్త ఆర్.రవికుమార్ (71) శుక్రవారం కన్నుమూశారు. చెన్నైలో పుట్టిపెరిగినప్పటికీ ‘లక్ష్మీప్రభ’ అనే మలయాళ చిత్రం ద్వారా వెండి తెరకు తొలిసారి పరిచయమయ్యారు. ఆ తర్వాత మలయాళంలోనే అనేక చిత్రాల్లో నటించారు. తమిళంలో దర్శక దిగ్గజం కె.బాలచందర్ వెండి తెరకు పరిచయం చేశారు. అగ్రహీరోలు రజనీకాంత్, కమల్ హాసన్ వంటి వారితో కలిసి నటించారు. ‘పగలిల్ ఒరు ఇరవు’ అనే చిత్రం ఆయన కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలిచింది. ఆ తర్వాత తమిళంలో ‘మలబార్ పోలీస్’, ‘రిషి’, ‘రమణ’, ‘లేసా లేసా’, ‘శివాజీ వంటి అనేక హిట్ చిత్రాల్లో నటించారు. ఒకవైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు అనేక టీవీ సీరియళ్లలో నటించారు. ముఖ్యంగా ‘చిత్తి’, ‘సెల్వి’, ‘అరసి’, ‘చెల్లమే’, ‘వాణి రాణి’ వంటి అనేక హిట్ సీరియళ్లలో నటించి పేరు తెచ్చుకున్నారు. గత నాలుగు దశాబ్దాలుగా చిత్రపరిశ్రమలో కొనసాగుతున్న ఆయన...కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో పాటు వయోభారంతో బాధపడుతూ నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు.స్థానిక చిన్నపోరూర్‌లోని టీటీ సీ సిటీ పార్కులోని స్వగృహంలో భౌతికకాయాన్ని సినీ ప్రముఖులు, అభిమానుల సందర్శనం కోసం ఉంచారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నా రు.

## ఈసీఆర్‌లో కోస్టల్ డైనింగ్ డెస్టినేషన్ ‘బీచ్ టెర్రస్’

అడయార్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈసీఆర్‌లోని వీజీపీ గోల్డెన్ బీచ్ రిసార్ట్‌కు సమీపంలో గ్రీకు సంస్కృతి ఉట్టిపడేలా ‘బీచ్ టెర్రస్’ పేరుతో కోస్టల్ డైనింగ్ డెస్టినేషన్ తాజాగా ప్రారంభించారు. ఈ రెస్టారెంట్‌లో మధ్యధరా ప్రాంతానికి చెందిన రుచులతో పాటు ఆహ్లాదకరమైన సముద్ర దృశ్యాలను ఆస్వాదిస్తూ ఆరగించవచ్చు. అసాధారణమైన వంటకాలతో పాటు బీచ్ టెర్రస్ ఈసీఆర్‌కు డైనమిక్ నైట్ లైఫ్ అనుభవాన్ని అందించనుంది. అలాగే, ఉత్సాహభరితమైన పబ్ వాతావరణం, వివిధ రకాలైన కాక్‌టైల్స్, లైవ్ మ్యూజిక్ వంటి అత్యాధునిక వసతులతో దీన్ని ప్రారంభించారు. ముఖ్యంగా అతిథులు సముద్రపు ఒడ్డున సేదతీరుతూ విశ్రాంతి తీసుకునేలా ఉంటుంది.


రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో నిర్వాహకులు

## జేపీఆర్ ఐకాన్ అవార్డుల ప్రదానం

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జేపీఆర్ విశ్వవిద్యాలయంలో ‘జేపీఆర్ ఐకాన్’ అవార్డుల ప్రదానోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. సినీ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్, సీనియర్ నేపథ్య గాయకుడు మనో, క్రికెటర్ విజయ్‌శంకర్, ఆర్కిటెక్ట్ జయశ్రీ రవి, యూట్యూబర్ మదన్‌గౌరి, విద్యావేత్త డాక్టర్ అశోక్ జి.వర్గీస్, పాక నిపుణుడు శ్రీనివాసరాజా, వెల్నెస్ నిపుణుడు విజయ్ కరుణానకరన్ ఈ అవార్డులను అందుకున్నారు. వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ రెజీనా మురళి, మురళి సుబ్రమణియన్, మార్గరెట్ రెజీనా, జె.మాక్లిన్ రెజీనా తదితరులు ఈ అవార్డులను ప్రదానం చేశారు.



నిర్వాహకులతో అవార్డు గ్రహీతలు

## 100 ఆలయాల్లో ఆధ్యాత్మిక పుస్తక విక్రయ కేంద్రాలు



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విక్రయ కేంద్రాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

● ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పునర్ముద్రణ జరిగిన అరుదైన ప్రాచీన ఆధ్యాత్మిక గ్రంథాలతో వంద ఆలయాల్లో ఏర్పాటైన పుస్తక విక్రయ కేంద్రాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సచివాలయంలో శుక్రవారం ఉదయం ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో చెన్నైలోని విల్లివాక్కం సౌమ్య దామోదర పెరుమాళ్ ఆలయం, కొళత్తూరు సోమనాథ ఆలయం, రాయపురం అంకాళమ్మ ఆలయం, వేళచ్చేరి దండీశ్వరాలయం, తిరువాన్మియూరు పాంబన్‌స్వామి ఆలయం, మైలాపూరు ముండగ కన్నియమ్మన్ ఆలయం సహా వంద ఆలయాల్లో ఈ పుస్తక విక్రయ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఈ పుస్తక విక్రయ కేంద్రాల ప్రారంభోత్సవంలో మంత్రి పీకే శేఖర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, పర్యాటక, దేవాదాయ శాఖల అదనపు ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ కే మణివాసన్, హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ పీఎన్ శ్రీధర్, అదనపు కమిషనర్లు సి. హరిప్రియా, పి. జయరామన్ తదితరులు పాల్గొన్నారు.

### డైరీ శాఖలో 64 మందికి నియమకాలు...

ఇదిలా ఉండగా సచివాలయంలో ఆరోగ్యశాఖ, పాడి పరిశ్రమల శాఖ, చేనేత శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో పరీక్షల విభాగం ద్వారా ఎంపికైన 621 మందికి ముఖ్యమంత్రి స్టాలిన్ నియామక ఉత్తర్వులు అందజేశారు. డైరీశాఖలో 64 మందికి, చేనేతశాఖలో 166మందికి, ఆరోగ్యశాఖలో 391 మందికి నియామక ఉత్తర్వులిచ్చారు. మంత్రులు ఆర్ఎస్ రాజ కన్నప్పన్, ఆర్ గాంధీ, ఎం. సుబ్రమణ్యం, సీఎస్ మురుగానందం తదితరులు పాల్గొన్నారు.


సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌తో గ్రూపు ఫొటో దిగిన నూతన ఉద్యోగులు

## శ్రీవిల్లిపుత్తూరు ఆలయంలో ఆండాళ్ తిరుకల్యాణోత్సవాలు ప్రారంభం


ధ్వజారోహణం చేస్తున్న వైష్ణవ పండితులు. (ఇన్‌సెట్‌లో) ఆండాళ్ - రంగమన్నార్

టి.నగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ ఆలయంలో అమ్మవారి తిరుకల్యాణోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ నెల 11న పంగుణి ఉత్తిరం పర్వదినాన ఆండాళ్ - రంగమన్నార్‌ల తిరు కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీవిల్లిపుత్తూరులో పెరియాళ్వార్ (విష్ణుచిత్తులు) కుమార్తెగా అవతరించిన ఆండాళ్, పెరుమాళ్‌ను పరిణయమాడదలచి మార్గశిర మాసంలో తిరుప్పావై పాశురాలను గానం చేసి వ్రతమాచరించింది. ఆ వ్రతం సత్ఫలితాన్ని ఇవ్వడంతో పంగుణి ఉత్తిరం పర్వదినాన ఆండాళ్‌ను రంగమన్నార్ పరిణయమాడినట్లు ఆలయ చరిత్ర చెబుతుంది. ఆ మేరకు శ్రీవిల్లిపుత్తూరులో ప్రతియేటా పంగుణి ఉత్తిరం పర్వదినాన ఆండాళ్, రంగమన్నార్‌ల తిరు కల్యాణం కనులపండువుగా నిర్వహిస్తుంటారు. ఆ మేరకు ఈ యేడాది తిరుకల్యాణోత్సవాలు గురువారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఆండాళ్ సమేత రంగమన్నార్ మాడవీధులలో ఊరేగారు. 13 రోజులపాటు జరుగనున్న ఈ ఉత్సవాల్లో శనివారం గరుడసేవ జరుగనుంది. 11న ఉదయం 7.05 గంటలకు రథోత్సవం, సాయంత్రం 5.30 నుంచి ఆండాళ్ - రంగమన్నార్ తిరుకల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ ట్రస్టుబోర్డు అధ్యక్షుడు పీఆర్ వెంకట్రామరాజా తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రస్టు బోర్డ్ సభ్యులు, కార్యనిర్వహణాధికారి సర్కరైయమ్మాళ్ తగు ఏర్పాట్లు చేపడుతున్నారు.


అతిథులు, సత్కారగ్రహీతలతో అమృత్‌కుమార్, శర్మ తదితరులు

## ఎస్ఆర్ఈఎస్ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు

ప్యారీస్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సదరన్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ (ఎస్ఆర్ఈఎస్) తెలుగు ఉద్యోగుల ఆధ్వర్యంలో విశ్వావసు నామ ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పెరంబూరులోని సంఘ్ ప్రధాన కార్యాలయం యూనిట్ హౌస్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఈ కార్యక్రమం జరిగింది.. ఎస్ఆర్ఈఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.రాఘవయ్య, ప్రధాన కార్యదర్శి వి.గోపాల కృష్ణ సూచనల మేరకు ఎస్ఆర్ఈఎస్ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన ఉగాది వేడుకలకు ఎస్.అమృత్‌కుమార్ సంచాలకులుగా, కార్యదర్శి ఓయూవీ శర్మ వక్తగా వ్యవహరించారు. ఈ వేడుకలకు రైల్వే అధికారులు కె.నాగరాజు, ఎం.విజయ్‌కుమార్, వి.విభూషనన్, ఎవర్విన్ విద్యాసంస్థల డైరెక్టర్ వి.మురళీకృష్ణ, కో-ఆర్డినేటర్లు ఎస్.మదన్‌గోపాల్, ఆర్.ప్రకాశ్, ఎస్ఆర్ఈఎస్ సభ్యులు సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలందిస్తున్న 50 మందికి ఉగాది కానుకగా జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు.

## హోం ఎలివేటర్‌ను ప్రారంభించిన ‘ఎలైట్’


మీడియాతో మాట్లాడుతున్న విమల్ బాబు

అడయార్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బహుళ అంతస్తులు, అపార్టుమెంట్లలో పెరుగుతున్న హోమ్ లిఫ్టుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని బెస్పోక్ పేరుతో ఎలైట్ ఎలివేటర్ కంపెనీ దేశంలోనే తొలిసారి హోమ్ ఎలివేటర్‌ను తయారు చేసింది. అధునాతన సాంకేతికతతో ప్రతి ఒక్కరికీ అనుకూలంగా ఉండేలా, ప్రత్యేకమైన జీవనశైలిత వినియోగదారులకు ఇంటిగ్రేటెడ్ జీవన అనుభవాన్ని అందించేలా వీటిని తయారుచేశారు. ఈ ఎలివేటర్ల విష్కరణల కార్యక్రమంలో ఎలైట్ ఎలివేటర్ ఫౌండర్, సీఈవో విమల్ బాబు మాట్లాడుతూ, ఎలైట్ ఎలివేటర్స్ తయారీలో ప్రపంచ స్థాయి సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించినట్టు తెలిపారు. బెస్పోక్ ఎలివేటర్లు దైనందిన జీవితాల్లో సజావుగా కలిసిపోయేలా జాగ్రత్తలు తీసుకుని తయారుచేసినట్టు వెల్లడించారు. అదేసమయంలో వినియోగదారులకు లగ్జరీ అనుభవాన్ని అందిస్తాయని పేర్కొన్నారు.



ఆలయం ముందు పూజాహెగ్డే

## తిరుమలేశుడి సేవలో పూజాహెగ్డే

హీరోయిన్ పూజా హెగ్డే శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజాము ఆలయంలో జరిగిన సుప్రభాతసేవలో ఆమె కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. దర్శనం తర్వాత పూజా హెగ్డే ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. మే 1వ తేదీన తన 'రెట్రో' చిత్రం విడుదల కానుందని తెలిపారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## టీటీడీకి మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వ్యాన్ల విరాళం

టీటీడీకి శుక్రవారం రెండు మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వ్యాన్లు విరాళంగా అందాయి. అన్నప్రసాదాలను భక్తులకు పంపిణీ చేసేందుకు వీలుగా బెంగుళూరులోని ఎంఎస్ రామయ్య విద్యాసంస్థలకు చెందిన ఎంఎస్ సుందర్ రామ్ అనే భక్తుడు రూ.45 లక్షల విలువైన రెండు అశోక్ లేల్యాండ్ బడాదోస్త్ మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వ్యాన్లను అందజేశారు. ఆలయం ముందు ఈ వాహనాలకు పూజలు నిర్వహించి, తాళాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో క్యూలైన్ వెంబడి ప్రసాదాలు, తాగునీరు అందించేందుకు ఈ వ్యాన్‌లు ఉపయుక్తంగా ఉంటాయని వెంకయ్య చౌదరి తెలిపారు. వాహనంలో ఒకేసారి 3 వేల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేయవచ్చున్నారు. ఈకార్యక్రమంలో టీటీడీ ట్రాన్స్‌పోర్టు డిపో మేనేజర్ లక్ష్మీప్రసన్న, ఇన్‌ఛార్జ్ డీఐ హరిబాబు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




## సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 21 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

**బుధవారం హుండీ ఆదాయం: రూ.4.51కోట్లు**

**గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,864**

**తలనీలాలు సమర్పించినవారు: 25,784**





# నైపుణ్య శిక్షణ.. భవితకు రక్షణ



- అన్ని వయస్సుల వారూ కంప్యూటర్ నేర్చుకునే అవకాశం
- తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో ప్రారంభం

నేను తిరుపతి బర్డ్ ఆసుపత్రిలో పని చేస్తున్నాను. నాకు ఉద్యోగంలో కంప్యూటర్ నాలెడ్జ్ అవసరం. ఇక్కడ నేర్పిస్తున్నారని తెలిసింది. శిక్షణ తీసుకుంటున్నాను. దీని వల్ల నాకు ఉద్యోగంలో ఎంతో ఉపయోగం అవుతుంది.

- నాగమణి బాయి



నేను ఆర్టీసీలో రిటైరయ్యాను. నేను ఉద్యోగం చేసే సమయంలో కంప్యూటర్ అవసరం పెద్దగా పడలేదు. ఇప్పుడు కంప్యూటర్ అన్ని చోట్లా అవసరం అయి పోయింది.నాకూ నేర్చుకోవాలని పించింది. నేను నేర్చుకుంటే నా మనవళ్లు, మనవరాళ్లకు నేర్పించగలను.

- రెడ్డప్ప



తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

నిత్యజీవితంలో కంప్యూటర్ ఒక భాగంగా అమరిపోయింది. చదువులో, ఉద్యోగంలో, వ్యాపారంలో ఒక అవసరంగా మారిపోయింది. కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడం వెనుకబాటుతనంగా ఆత్మన్యూనతను పెంచుతోంది. ఒళ్లో ల్యాప్‌టాప్ పెట్టుకుని కీబోర్డు మీద టకటకలాడించే పిల్లలకూ, వంటావార్పూ పనుల్లో సతమతమయ్యే పెద్దలకూ నడుమ కనిపించని అగాధం పెరుగుతోంది. సర్వ ప్రపంచాన్నీ, సకల సమాచారాన్నీ తనలో ఇముడ్చుకున్న ఆ బుల్లిపెట్టెకు దగ్గర కావడం ఎలాగో తెలీక చాలా మంది అవస్థ పడుతుంటారు. కిరాణా దుకాణాల మొదలు, బట్టల షాపుల దాకా ఎక్కడ పనికోసం వెళ్లినా.. కంప్యూటర్ వచ్చా అని అడుగుతారు. దీంతో చిన్న చిన్న చదువుల దగ్గర ఆగిపోయినవారు అవస్థ పడుతుంటారు. ఇటువంటి వారి కోసమే తిరుపతిలో వేమన విజ్ఞాన కేంద్రం ఒక వినూత్న ప్రయత్నం ప్రారంభించింది. వేసవిలో కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. ఎవరైనా ఇక్కడ కంప్యూటర్ శిక్షణ పొందవచ్చు. కంప్యూటర్‌పై అవగాహన కలిగించడం, అవసరాన్ని బట్టీ తగిన కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం వీరి ఉద్దేశ్యం. సన్నాబన్నా ప్రజలకు ఇదో మంచి అవకాశం.



నేను పదో తరగతి పరీక్షలు పూర్తి చేశాను. ఇంట్లో ఖాళీగా ఉండడం కంటే కంప్యూటర్ శిక్షణ తీసుకోవడం మేలు. బయట చూసిన సెంటర్ల కంటే ఇక్కడ కంప్యూటర్లు చాలా ఉన్నాయి. శిక్షణ చాలా బాగుంది. ఇంటర్‌లో చేరేటప్పటికే బేసిక్స్ నేర్చుకునేందుకు నాకు వీలు కలుగుతోంది.

- కావ్య

**అర్హత:** 7వ తరగతి దాకా చదువుకుని ఉంటే చాలు
**కోర్సులు:** ఎంఎస్ ఆఫీస్, ఎంఎస్ వర్డ్, ఎంఎస్ ఎక్సెల్ , ట్యాలీ
**తరగతులు:** ఉదయం 8గంటలకు ట్యాలీపై శిక్షణ. సాయంత్రం కంప్యూటర్ ప్రాథమిక పరిజ్ఞానం
**బ్యాచ్‌లు:** ఉదయం 8 నుంచి ఒక బ్యాచ్. సాయంత్రం 4 నుంచి 6 దాకా ఒక బ్యాచ్. 6 నుంచి రాత్రి 8 దాకా ఒక బ్యాచ్.
**వయసు:** ఏ వయసు వారికైనా శిక్షణ ఇస్తారు.
**వివరాలకు:** 99665 84759, 89850 80370

మార్చి 30న లాంఛనంగా తిరుపతి యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ తరగతులు మొదలయ్యాయి. ఈ నెల 2 నుంచీ బ్యాచ్‌ల వారీగా శిక్షణ ప్రారంభించారు. చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్నవారూ, పేద విద్యార్థులు, గృహిణులు, రిటైరైన ఉద్యోగులు శిక్షణ తరగతులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం 25 కంప్యూటర్లు ఉన్నాయి. వీటి సంఖ్యను మరింత పెంచే ఆలోచనలో ఉన్నారు. పెద్దవాళ్లు కూడా పిల్లల్లా మారి కంప్యూటర్ గురించి తెలుసుకుంటున్నారు.

### చాలా ఉపయోగకరం



వేమన విజ్ఞాన కేంద్రం చేస్తున్న అనేక కార్యక్రమాల్లో కంప్యూటర్ శిక్షణ కూడా ఒకటి. మరికొన్ని రోజుల్లో మరిన్ని శిక్షణలను అందుబాటులోకి తీసుకొస్తాం. ప్రస్తుతం 25 కంప్యూటర్లతో ట్యాలీ, కంప్యూటర్ బేసిక్స్‌పై శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ కావాలంటూ భిన్న వర్గాల వారు వస్తున్నారు. ఈ శిక్షణను నిరుద్యోగులు, విద్యార్థులు బాగా ఉపయోగించుకోవచ్చు. గృహిణులు, పెద్దవారికి కంప్యూటర్‌పై అవగాహన కలుగుతుంది. వారి ఆసక్తినిబట్టి కోర్సుల్లో శిక్షణ పొందవచ్చు. కంప్యూటర్ కోర్సులు నేర్చుకుంటే ఇంట్లో నుంచీ డబ్బులు సంపాదించే అవకాశాలు ఉన్నాయి.

- పంచముఖేశ్వరరావు, కేంద్రం ఇన్‌చార్జి



నేనేమీ ఉద్యోగం చేయడం లేదు కానీ ఎక్కడ చూసినా కంప్యూటర్‌లే ఉంటున్నాయి. నాకూ వాటి గురించి తెలుసుకోవాలనిపించింది. వేమన విజ్ఞాన కేంద్రంలో నేర్పిస్తారని తెలిసి వస్తున్నాను. నేను నేర్చుకోవడం నా పిల్లలకు కూడా ఉపయోగపడుతుంది.

- నాగమణి



## వళ్లలార్ అంతర్జాతీయ కేంద్రానికి సుప్రీం కోర్టు గ్రీన్‌సిగ్నల్



వళ్లలార్ కేంద్రం నమూనా చిత్రం

టి.నగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా వడలూరు వళ్లలార్ ఆలయ సమీపంలో వళ్లలార్ అంతర్జాతీయ కేంద్రం నిర్మాణంపై విధించిన స్టే ఉత్తర్వును సుప్రీం కోర్టు తొలగించింది. వళ్లలార్ అంతర్జాతీయ కేంద్రాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ నిర్మించడానికి హైకోర్టు అనుమతిస్తూ తదుపరి ఉత్తర్వు వెలువరించేంత వరకూ నిర్మాణ పనులు చేపట్టరాదంటూ ఆదేశాలిచ్చింది. ఈ వ్యవహారంలో రాష్ట్ర బీజేపీ ఆధ్యాత్మిక విభాగం కార్యదర్శి వినోద్ రాఘవేంద్రన్ సుప్రీం కోర్టులో అప్పీలు పిటిషన్ వేశారు. దీనిపై విచారించిన సుప్రీం కోర్టు ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వ తరపు వాదనలను రాతపూర్వకంగా స్వీకరించింది. అదే సమయంలో హైకోర్టు విధించిన స్టే కొనసాగుతుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో గురువారం ఈ పిటిషన్‌పై విచారణ జరిగింది. వాద ప్రతివాదనల అనంతరం వడలూరు వద్ద వళ్లలార్ అంతర్జాతీయ కేంద్రం నిర్మాణంపై విధించిన స్టే తొలగిస్తూ ఉత్తర్వులు వెలువరించింది.

## బహిరంగ ప్రాంతాల్లో పార్టీ స్తంభాలు తొలగించండి

- టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై

పెరంబూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రాంతాల్లోని పార్టీ జెండా స్తంభాలు తొలగించాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై విజ్ఞప్తి చేశారు. మద్రాసు హైకోర్టు ఆదేశాల మేరకు బహిరంగ ప్రాంతాల్లో ఉన్న పార్టీ జెండా స్తంభాలు తొలగించాలని కార్యకర్తలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## చెన్నైలో తగ్గిన నేరాలు

- కమిషనర్ అరుణ్

అడయార్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై పరిధిలో గతంలో పోల్చితే నేరాల సంఖ్య తగ్గినట్టు నగర పోలీస్ కమిషనర్ అరుణ్ వెల్లడించారు. అలాగే, చెన్నై నగర పాలక సంస్థ అధికారులతో కలిసి పాఠశాలలు, కాలేజీలకు సమీపంలో ఉన్న కిరాణా షాపులు, దుకాణాల్లో గంజాయి, గుట్కా వంటి మత్తుపదార్థాల ఉత్పత్తుల విక్రయాలను నిర్మూలిస్తున్నట్టు వెల్లడించారు. హర్యానా రాష్ట్రంలో జరిగిన హార్స్ రేసింగ్‌లో పాల్గొని విజయం సాధించిన పోలీస్ రేసర్లకు నగర కమిషనరేట్ కార్యాలయంలో అభినందన కార్యక్రమం జరిగింది. ఇందులో పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ అరుణ్ మాట్లాడుతూ, చెన్నై నగర వాసులు భద్రత, రక్షణకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు వెల్లడించారు. గత కొంతకాలంగా నమోదైన గణాంకాలను పరిశీలిస్తే.. గతంతో పోలిస్తే నగరంలో నేరాల సంఖ్య తగ్గిందని ఆయన వెల్లడించారు. యువతలో గుట్కా తీసుకునే అలవాటు క్రమేణా తగ్గుతుందని కమిషనర్ వెల్లడించారు.



హార్స్ రేస్ విజేతను అభినందిస్తున్న కమిషనర్

## తిరుపతి- కాట్పాడి మధ్య ఆరు ప్యాసింజర్ రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): తిరుపతి-కాట్పాడి మధ్య 5 నుంచి 22వ తేదీ వరకు ఆరు ప్యాసింజర్ రైళ్లు రద్దు చేసినట్లు జోనల్ డిప్యూటీ సీఓఎం మణికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి-కాట్పాడి మార్గంలోని రామాపురం రైల్వేస్టేషన్ యార్డు వద్ద చెన్నై-బెంగళూరు జాతీయ రహదారికి సంబంధించి బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్న కారణంగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కాగా, విల్లుపురం-తిరుపతి మధ్య నడుస్తున్న (16854) ప్యాసింజరు రైలు కాట్పాడి-తిరుపతి మధ్య ఈ నెల 6, 8, 9, 10, 13, 15, 16, 17, 20, 22 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు గుర్తించి, సహకరించాలని కోరారు.



నెహ్రూ ఇండోర్ స్టేడియంలోని చెన్నై ఒలింపిక్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెరియకుళం వద్ద రూ.5.95 కోట్లతో నిర్మించిన ఇండోర్ స్టేడియంను ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

## తిరుపతి- పళణి బస్సు ప్రారంభం



తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి- పళణి బస్సు శుక్రవారం రాత్రి బయలుదేరింది. ఈ సర్వీసును డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గురువారం అమరావతిలో ప్రారంభించిన విషయం తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం ఆ బస్సు శుక్రవారం రాత్రి 8 గంటలకు బయల్దేరింది. కృష్ణగిరి, పళణికి 15మంది ప్రయాణికులు ఎక్కారు. రోజూ రాత్రి 8 గంటలకు మొదలై చిత్తూరు, పలమనేరు, కుప్పం, కృష్ణగిరి, ధర్మగిరి, భవాని, ఈరోడ్ మీదుగా పళణికి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు చేరుకుంటుంది. అక్కడ్నుంచి రోజూ రాత్రి 9 గంటలకు ప్రారంభమై ఇదే మార్గంలో మరుసటి రోజు ఉదయం 8గంటలకు తిరుపతికి వవస్తుంది. పెద్దలకు రూ.680, పిల్లలకు రూ.360 చార్జీ. రిజర్వేషన్ సౌకర్యం ఉంది.

## వక్ఫ్ బోర్డులో మార్పు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి!

- టీవీకే మహిళా విభాగం డిమాండ్

ప్యారీస్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు నష్టం కలిగించే రీతిలో వక్ఫ్ బోర్డు చట్టంలో మార్పులు తీసుకొస్తూ పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదించిన నూతన వక్ఫ్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక పులియాన్‌తోపులో శుక్రవారం టీవీకే ఆధ్వర్యంలో మహిళలు ధర్నా నిర్వహించారు. చెన్నై ఉత్తర జిల్లా తిరువీకానగర్ రిజర్వ్ నియోజకవర్గ టీవీకే కార్యదర్శి ఎమ్మార్ పల్లవి అధ్యక్షతన జరిగిన ఈ ఆందోళనలో పాల్గొన్న మహిళలు ప్లకార్డులు ప్రదర్శించి కేంద్రప్రభుత్వంపై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులతో పాటు టీవీకే మహిళా కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనగా, అనుమతిలేదని కారణం చూపిన పోలీసులు ఆందోళనాకారులను అరెస్ట్ చేసి పులియన్‌తోపులోని లండన్ మహల్‌కు తరలించారు.

## ఊటీ, కొడైకెనాల్‌లో 'ఫునిక్యులర్' రైలు నడపడంపై అధ్యయనం



పెరంబూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఊటీ, కొడైకెనాల్ తదితర పర్యాటక ప్రాంతాల్లో 'ఫునిక్యులర్' రైలు నడపించేందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) నిర్ణయించింది. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ మెరుగుపరిచేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఊటీ, కొడైకెనాల్, మహాబలిపురం ప్రాంతాల్లో 'ఫునిక్యులర్' రైళ్లు నడిపేందుకు చేపట్టాల్సిన నిర్మాణాలపై అధ్యయనం చేపట్టింది. ఇందుకోసం ఇటీవల టెండర్లు కూడా ఆహ్వానించారు. ఇరుకైన ట్రాక్‌లు, కొండల్లోని వంపుల్లో ఈ రకమైన రైళ్లు నడిపే వీలుంది. పర్యాటకులు ప్రకృతి అందాలు ఆస్వాదించేలా అద్దాల బోగీలు, భద్రతా అంశాలు ఈ రైలులో ఉంటాయి. ఊటీ, కొడైకెనాల్ కొండల్లో నిర్మాణ సాధ్యాసాధ్యాలు, ఏఏ మార్గాల్లో ఎంత దూరం ప్రయాణించవచ్చు తదితరాలను అధ్యయన చేసి ఆరు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించాలని టెండర్లలో పేర్కొన్నారు.మహాబలిపురంలోని పర్యాటక ప్రాంతాలు పరిశీలించి, అధునాతన రోప్ కార్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయమై సీఎంఆర్‌ఎల్ అధికారులు మాట్లాడుతూ... ఫునిక్యులర్ రైళ్లలో అనేక రకాలున్నాయన్నారు. ఒక బస్సు సైజు బోగీ, ఒక బస్సును రెండుగా విభజిస్తే వచ్చే సైజు, వృత్తాకార బోగీ ఇలా పలురకాల బోగీలున్నాయని తెలిపారు. మన రాష్ట్రానికి ఎలాంటి బోగీ అవసరం అనే విషయం అధ్యయం అనంతరం, అందుకు సంబంధించిన పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

## రోడ్లపై ఆక్రమణలను తొలగించండి!

- అధికారుల ఆదేశాలు





తిరుత్తణి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పొదటూర్‌పేట బస్టాండ్ సమీపంలో, రోడ్లపై అక్రమంగా ఏర్పాటు చేసుకున్న కూరగాయల దుకాణాలు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి.ఈ దుకాణాలు ఏర్పడినప్పటి నుండి ఉదయం, సాయంత్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడి ప్రతిరోజు ఉద్యోగులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పట్టణ అధికారులు చర్యలు చేపట్టాలని అక్కడి స్థానికుల విజ్ఞప్తిపై స్పందించిన పొదటూర్‌పేట అధికారులు వెంటనే దుకాణాలను తొలగించాలని వ్యాపారులకు హెచ్చరికలుజారీచేశారు.అయినప్పటికీ వ్యాపారులు తమ దుకాణాలను తొలగించకుండా యథేచ్ఛగా వ్యాపారాలు జరుపుకుంటున్నారు. అధికారులు హెచ్చరించినా దుకాణాలు తొలగించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## వక్ఫ్ బిల్లుపై అనవసర రాద్ధాంతం

- విపక్షాలపై అన్నామలై విసుర్లు



కోవై విమానాశ్రయ వద్ద మీడియాతో మాట్లాడుతున్న అన్నామలై

చెన్నై, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లును ఆమోదించారని, ఆ బిల్లును తాము స్వాగతిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రకటించారు. శుక్రవారం ఉదయం కోయంబత్తూరు విమానాశ్రయం వద్ద మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వక్ఫ్ బిల్లుపై డీఎంకే సహా రాష్ట్రంలోని పార్టీలు అనవసరమైన ఆందోళన వ్యక్తం చేస్తుండటం గర్హనీయమన్నారు. అన్నాడీఎంకే, బీజేపీ మధ్య అసెంబ్లీ ఎన్నికల పొత్తు కుదిరే అవకాశాలు ఏర్పడటం వల్లే అధ్యక్ష పదవి నుండి తప్పుకొంటున్నారా అని విలేఖరులు అడిగిన ప్రశ్నకు ఆ విషయంపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చెప్పదలచుకోలేదని, అధిష్టానవర్గం నిర్ణయాలకు శిరసావహించడమే రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా తన ప్రథమ కర్తవ్యమని అన్నామలై అన్నారు